కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

వికారాబాద్, అక్టోబర్ 29 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మంగళవారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొని సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై తగు సూచనలు, మార్గదర్శకాలను నిర్దేశించారు. వానకాలం వరి ధాన్యం సేకరణకు సంబంధించిన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తంకుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, అనసూయ సీతక్క వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు చేశారు.

ఈ సందర్భంగా నారాయణపేట కలెక్టరేట్ నుంచి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా చేపట్టాల్సిన విధి విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండేలా మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.

జిల్లాలో సర్వే చేపట్టేందుకు వీలుగా 2045 మంది ఎన్యుమరేటర్లు, 205 మంది సూపర్ వైజర్లు అవసరం ఉండగా అదనంగా పది శాతం సిబ్బందిని సమకూర్చుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో విధులు నిర్వహించిన ఆపరేటర్ల సేవలను తీసుకుంటామని ఆమె వివరించారు. వికారాబాద్ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీవో శ్రీనివాస్, సీపీవో అశోక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్లు, అధికారులు

సర్వే ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

వికారాబాద్ ఇన్‌చార్జి కలెక్టర్ సిక్తా పట్నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ సిక్తా పట్నాయక్

సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వేకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని వికారాబాద్ ఇన్‌చార్జి కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం హాలులో ఇంటింటి సర్వే కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వే నవంబర్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. సర్వే కోసం ఎన్యుమరేటర్లు, ఎన్యుమరేటర్ల బ్లాక్, హౌస్ లిస్టింగ్ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మండలాలవారీగా ఎంపీడీవోలు, తహసీల్దార్లు ఎన్యుమరేటర్ల ఎంపికను శ్రద్ధతో జరిపి, వారి వివరాలను బ్లాక్‌వారీగా అందజేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రెవెన్యూ గ్రామాలు గ్రామపంచాయతీల్లో విలీనం కావడంలో ఎదురవుతున్న సమస్యల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డిజిటలైజేషన్ కోసం డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. సర్వే నిర్వహణ కోసం ఎన్యుమరేటర్లకు సంబంధించిన ప్రత్యేక శిక్షణను మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సర్వే పనిని వేగంగా, విజయవంతంగా పూర్తి చేయడానికి అత్యుత్తమ ఎన్యుమరేటర్లను ఎంపిక చేయాలన్నారు. అవసరమైతే అదనపు ఎన్యుమరేటర్లను కూడా సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రతి తహసీల్దార్, ఎంపీడీవో వద్ద గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల నివాస స్థలాల మ్యాప్‌లు, హౌస్ లిస్టింగ్ ఫార్మాట్, 57 ప్రశ్నల ఫార్మాట్, సర్వే పూర్తయిన ఇంటిపై అతికించు స్టిక్కర్ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఈ సర్వే అన్ని ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని, ఎటువంటి తప్పులు లేకుండా, ఎంత త్వరగా సాధ్యమైతే అంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మండలాలవారీగా ఎంత జనాభా ఉన్నది, ఎంత మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, మున్సిపల్ పరిధిలో ఎన్ని వార్డులు ఉన్నవి, ప్రస్తుతం వార్డులవారీగా ఎలా చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు పీపీటీ ద్వారా సర్వే ఏవిధంగా చేయాలన్నది.. అందరికీ అవగాహన కల్పించారు. అంతకు ముందు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. సమావేశంలో డీఆర్‌డీఏ శ్రీనివాస్, సీపీవో అశోక్ పాల్గొన్నారు.

బకాయిలను వెంటనే విడుదల చేయాలి

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 29 : విద్యారంగానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న రూ.8,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. స్కాలర్‌షిప్స్ లేకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నదని, విద్యాభ్యాసం పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, అక్టోబర్ 29 : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు అందేలా అధికారులుగా మనం కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహించే సూపరింటెండెంట్లకు, ఎన్యుమరేటర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, జిల్లా ప్రణాళిక అధికారులతో ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతనంగా జిల్లాకు కలెక్టర్‌గా రావడంతోపాటు జిల్లాలో విధులు నిర్వహించడానికి అవకాశం రావడం, ఈ అవకాశాన్ని నిర్వీర్యం చేయకుండా ఇంకా భాద్యతగా చేయడానికి కృషిచేస్తానన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతతో ఉద్యోగం నిర్వహిస్తే ప్రభుత్వంలో వారు పైస్థాయి ఉద్యోగులుగా ఎదుగుతారన్నారు. ప్రభుత్వం నుంచి అమలు చేస్తున్న పథకాలను గ్రామం నుంచి పట్టణం వరకు లబ్ధిదారులకు అందేలా కార్యాచరణ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా సేవకులమై సేవలందించాలన్నారు. మనకు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లాలో 100 శాతం టీమ్ వర్క్‌తో పని చేసి జిల్లాను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుపోవాలని ఆయన కోరారు.

సమగ్ర సర్వే పకడ్బందీగా చేయాలి

నవంబర్‌లో చేపట్టే సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. ట్రైనింగ్‌లో పాల్గొన్న ఎన్యుమరేటర్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ.. సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వేకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సర్వే కోసం ఎన్యుమరేటర్లు, ఎన్యుమరేటర్ల బ్లాక్, హౌస్ లిస్టింగ్ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు ఎన్యుమరేటర్ల ఎంపికను శ్రద్ధతో జరిపి, వారి వివరాలను బ్లాక్‌వారీగా అందజేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లను కమిషనర్లు చేసుకోవాలన్నారు. రెవెన్యూ గ్రామాలు గ్రామపంచాయతీల్లో విలీనం కావడంతో ఎదురవుతున్న సమస్యల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డిజిటలైజేషన్ కోసం డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. సర్వేను వేగంగా పూర్తి చేయడానికి తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మండలాలవారీగా ఎంత జనాభా ఉందనే అంశంతోపాటు ప్రతి విషయాన్ని ఈ నెల 30 వరకు అందించాలన్నారు. డేటాను కనీసం నవంబర్1లోగా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. పీపీటీ ద్వారా సర్వే ఏవిధంగా చేయాలన్నది అందరికీ అవగాహన కల్పించారు. సమావేశంలో డీఈఆర్‌వో సంగీత, జిల్లా ప్రణాళికాధికారి సౌమ్య పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాముఖ్యతపై యువతలో అవగాహన కల్పించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- ఓటరు ముసాయిదా జాబితా విడుదల

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, అక్టోబర్ 29 : ఓటు హక్కు ప్రాముఖ్యతపై యువతలో అవగాహన కల్పించి ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో ఓటరు ముసాయిదా జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించి జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు నూతనంగా ఓటరు నమోదు, ఏవైనా మార్పులు చేర్పులతో పాటు ఓటరు జాబితాలో అభ్యంతరాలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్ స్థాయిలో ఏజెంట్లను నియమించే దిశగా జాబితాలను సమర్పించాలన్నారు.

ఓటరు నమోదుకు నవంబర్ 28 చివరి తేది ఉన్నందున నవంబర్ 9, 10 తేదీల్లో ఓటరు నమోదుకు బూత్‌స్థాయిలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేసుకోదలచిన వారు ఫారం-8, ఫారం-6 ద్వారా నూతన ఓటరుగా నమోదుకై దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 1133 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ అలీ, డిప్యూటీ తహసీల్దార్ ఉషసిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు ముసాయిదా జాబితా నియోజకవర్గాలవారీగా..

నియోజకవర్గం	ఓటర్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు
పరిగి	2,68,583	1,34,482	1,34,092	9
వికారాబాద్	2,32,884	1,15,531	1,17,339	14
తాండూరు	2,45,941	1,19,081	1,26,853	7
కొడంగల్	2,46,450	1,19,585	1,23,860	5
మొత్తం	9,90,858	4,88,679	5,02,144	35

డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం

- జిల్లాలో తగ్గిన క్రైం రేటు
- 8 కొత్త పోలీసు స్టేషన్ భవనాలకు ప్రతిపాదనలు
- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి
- కరణ్‌కోట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డుల పరిశీలన

కరణ్‌కోట పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు రూరల్, అక్టోబర్ 29 : జిల్లాలో క్రైం రేటు బాగా తగ్గిందని, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని, జిల్లాలో 8 కొత్త పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు మండలం, కరణ్‌కోట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత 10 నెలల కాలంలో క్రైం రేటు బాగా తగ్గిందన్నారు. డ్రగ్స్‌పై పోలీసుల నిఘా ఉందని, డ్రగ్స్ సరఫరా చేసే వారికంటే, వినియోగదారుల నుంచి పూర్తి సమాచారం లాగేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా సైబర్ క్రైం, వాట్సప్ కాల్, ఓటీటీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా ఐటీ ఉద్యోగులు ఎక్కువగా నష్టపోతున్నారని వివరించారు. ఇటీవల ఓ ఐటీ ఉద్యోగి రూ.84 లక్షలు పోగొట్టుకున్నారని తెలిపారు. ఇలాంటి మోసాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రజల్లో చైత్యనం రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, ఇతరులకు మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. జిల్లాలో అక్రమ ఇసుక దందాను పూర్తిస్థాయిలో తగ్గించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కరణ్‌కోట పోలీస్‌స్టేషన్ పనితీరు బాగుందని పేర్కొన్నారు. గత ఏడాదికంటే ఈసారి క్రైం రేటు బాగా తగ్గిందని, మొత్తం 228 కేసులు నమోదైనట్లు వివరించారు. పెద్ద పెద్ద నేరాలు కాకుండా, చిన్నచిన్న కేసులు నమోదైనట్లు తెలిపారు. నేరాల అదుపునకు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే క్రైం రేట్ చాలా తగ్గుతుందని ఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై విఠల్‌రెడ్డి ఉన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగుకు తేలికపాటి నేలలు చాలా అనుకూలం

- జాతీయ పత్తి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త గుల్షర్ భాను
- తాండూరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త యుమున

క్షేత్ర సందర్శనలో శాస్త్రవేత్తలు, రైతులు

పెద్దేముల్, అక్టోబర్ 29 : అధిక సాంద్రత పత్తి సాగుకు తేలికపాటి నేలలు చాలా అనుకూలంగా ఉంటాయని జాతీయ పత్తి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త గుల్షర్ భాను అన్నారు. మంగళవారం తాండూరు డివిజన్‌లోని రుద్రారం, ఇందూరు, రాగాపూర్, చెన్నారం గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధనా స్థానం, ఏరువాక కేంద్రం-తాండూరు వారి ఆధ్వర్యంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్ వారి ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై గ్రామాల్లో క్షేత్ర సందర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తి ఆవశ్యకతను రైతులకు వివరించడం ఎంతో అవసరమన్నారు. కొన్ని సంవత్సరాలుగా పత్తి దిగుబడి నిలకడగా ఉన్నదని, దీనిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులకు సూచించారు. సాధారణ పత్తి సాగులో కూలీల కొరత తీవ్రంగా ఉంటుందని, వివిధ దశల్లో పత్తి తీయడం రైతులకు భారంగా మారిందని వివరించారు. అధిక సాంద్రతలో యాంత్రీకరణతో పత్తి విత్తుకోవచ్చని, దీంతో విత్తనాలు సరైన లోతులో విత్తడం వలన మొలక మంచిగా వస్తుందన్నారు. అలాగే సరైన దూరం వరుసలు, మొక్కల మధ్యన 90*15 సెంటీమీటర్ల దూరంతో విత్తుకోవచ్చని వివరించారు. తాండూరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త యుమున మాట్లాడుతూ.. ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా ఈ పద్ధతిలో పంట కాలం త్వరగా పూర్తయి జనవరి మాసంలో రెండో పంటగా పెసర, మినుములు వేసుకొని రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని రైతులకు సూచించారు. అధిక సాంద్రత పత్తిలో సాధారణ పత్తితో పోలిస్తే మొక్కల సంఖ్య అధికంగా ఉండటం వలన అధిక దిగుబడి పొందవచ్చునని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్-2 మధు, యంగ్ ప్రొఫెషనల్-1 మజీద్, రైతులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన అధికారులు

స్వాతంత్ర్య సాధనలో న్యాయవాదుల పాత్ర కీలకం

ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ చంద్రయ్య

కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ చంద్రయ్య

మొయినాబాద్, అక్టోబర్ 29 : భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో న్యాయవాదుల పాత్ర చాలా కీలకమని ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ చంద్రయ్య అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో ఉన్న భాస్కర లా కళాశాలలో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రయ్య మాట్లాడుతూ.. బాధితులకు న్యాయం చేసే దిశగా న్యాయవాదుల మద్దతు, న్యాయమూర్తుల తీర్పు ఉండాలని.. అప్పుడే న్యాయ వ్యవస్థపై ప్రజలకు అపారమైన నమ్మకం ఉంటుందని చెప్పారు. న్యాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రతి చట్టంపై సంపూర్ణమైన అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పట్టాల కోసం న్యాయ విద్య అభ్యసిస్తే సమాజానికి ఏ మాత్రం ఉపయోగపడదని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల డైరెక్టర్ సీనియర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి, జేబీ విద్యా సంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు, జేబీఈఎస్ డైరెక్టర్ అంజయ్య, భాస్కర లా కాలేజ్ ప్రిన్సిపాల్ భగవద్గీత పాల్గొన్నారు.

తెలంగాణ పశుసంవర్ధక శాఖ అధికారుల సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కొడంగల్, అక్టోబర్ 29 : తెలంగాణ పశుసంవర్ధక శాఖ అధికారుల సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో పట్టణానికి చెందిన పశువైద్యాధికారి ఏడీ డా.నోహా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని వెట్‌హోంలో జరిగిన ఎన్నికల్లో మొత్తంగా 290 మంది అధికారులు పాల్గొన్నారు. ఇందులో డా.నోహా ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక కావడంపై సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్‌లో గుర్తించి ఉపాధ్యక్ష పదవికి ఎన్నుకున్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. పాడి పంట, మేలురకం జాతి పశువుల ఉత్పత్తికిగాను కృత్రిమ గర్భధారణ, గడ్డికొరత నివారణకుగాను సబ్సిడీపై విత్తనాల సరఫరా, జీవాలు, పశువులకు వ్యాక్సినేషన్ వంటి ప్రభుత్వం చేపడుతున్న ఎన్నో కార్యక్రమాలను పశువైద్య సిబ్బంది విజయవంతం చేస్తున్నట్లు తెలిపారు. పశువులు, జీవాల్లో వచ్చే సీజనల్ వ్యాధులను ముందస్తుగా గుర్తించి ప్రభుత్వం ద్వారా టీకాలు వేయడం వల్ల పశువుల్లో రోగనిరోధక శక్తి పెరిగి పాడిరైతుతో పాటు గొర్రెల పెంపకందారులు ఆర్థికంగా అభివృద్ధిని సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పశుసంవర్ధక శాఖలో ఎలాంటి పునర్ వ్యవస్థీకరణ జరుగలేదని, తద్వారా ప్రమోషన్‌ల చానల్ కొనసాగక, ఏండ్లకాలంగా పశువైద్యులు ఒకేస్థాయి ఉద్యోగాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. శాఖలో మూడంచెల వ్యవస్థ అమలైతే వివిధ విభాగాల్లో ప్రమోషన్‌లు అందుకునే అవకాశంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింతగా బలపడి, అధికంగా రైతులకు సేవలు అందించే అస్కారం ఏర్పడుతుందన్నారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా నూతనంగా ఎన్నుకోబడ్డ అసోసియేషన్ కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నూతనంగా ఎన్నికైన తెలంగాణ పశుసంవర్ధక శాఖ అధికారుల సర్వీస్ అసోసియేషన్ సభ్యులు

దివ్యాంగుల తడాఖా చూపిస్తాం

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య

సమావేశంలో మాట్లాడుతున్న కాళ్ల జంగయ్య

యాచారం, అక్టోబర్ 29 : ఆసరా పింఛన్‌లు పెంచేవరకు పోరాడుతామని, రానున్న రోజుల్లో రేవంత్ సర్కారుకు దివ్యాంగుల తడాఖా చూపిస్తామని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. మండల కేంద్రంలోని దివ్యాంగుల భవనంలో మంగళవారం జిల్లా కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. రేవంత్ సర్కార్ దిగొచ్చే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు లేవదీయనున్నట్లు తెలిపారు. నవంబర్ 5న యాచారం మండలంలోని మాల్‌లో, 10న ఇబ్రహీంపట్నంలో సభలు, 17 నుంచి 23 వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ముట్టడి, 26న పెద్దఎత్తున చలో హైదరాబాద్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30 నుంచి నవంబర్ 28 వరకు హైదరాబాద్‌లో ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించొద్దని 144 సెక్షన్ అమలు చేసిందని, ఎన్ని నిర్బంధాలు పెట్టినా ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని వీహెచ్‌పీఎస్ ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి రాగానే పింఛన్‌లు పెంచుతామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు గద్దెనెక్కి పది నెలలు దాటినా పింఛన్ పెంచకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. దివ్యాంగులతో పెట్టుకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి భవిష్యత్తులో తీరని నష్టం చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇకపై కాంగ్రెస్ నాయకులను అడుగడుగునా అడ్డుకుంటామన్నారు. ప్రభుత్వానికి పింఛన్‌దారుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే వృద్ధుల, వితంతువుల పింఛన్‌ను రూ.4016, దివ్యాంగులకు రూ.6016లకు పెంచాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆసరా పింఛన్‌దారులే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఏదేమైనా పింఛన్ పెంచేవరకు వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు